ప్రజాశక్తి
శనివారం 29 మార్చి 2025   8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

విద్యుత్ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

పెంచిన సర్‌ఛార్జీలను
రద్దు చేయాలి

- ఇంధన సర్దుబాటు ఛార్జీలను ప్రభుత్వమే భరించాలి..
- స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి
- విద్యుత్ భవన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రజలకు పెనుభారమైన విద్యుత్ సర్ ఛార్జీలు, సెకి ఒప్పందం - టైమ్ ఆఫ్ డే అమలు వంటి విధానాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు, సర్ చార్జీలు, ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల సంపదను దోచుకుని అదాని వంటి కార్పొరేట్లకు కట్టబెట్టొద్దని పలువురు వక్తలు ప్రభుత్వానికి హితవు పలికారు. శుక్రవారం నాడు స్మార్ట్ మీటర్లు, విద్యుత్ సర్దుబాటు చార్జీలు, సెకి ఒప్పందంరద్దు, విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ ఒంగోలు విద్యుత్ భవన్ వద్ద సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆ పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు మాట్లాడుతూ టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 'బాదుడే బాదుడు' ▶ 2లో

నిధులిస్తేనే ముందుకు..

- సమస్యలు, అవసరాలు సిఎంకు నివేదించిన కలెక్టర్
- 9 నెలలుగా అనేక రంగాల్లో నిధుల కోసం ఎదురుచూపులు
- జిల్లా మంత్రి, ప్రజాప్రతినిధులూ దృష్టి సారిస్తేనే అభివృద్ధి అడుగులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లా ప్రాధాన్యతలు, ఆర్థిక అవసరాలు, సమస్యలు.. అన్ని కోణాల్లో సిఎం చంద్రబాబు నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ అన్సారియా నివేదించారు. లక్ష్యాలను వెల్లడించారు. అంతకుముందు జరిగిన సమావేశంలో విజన్ 2047కు అనుగుణంగా జిల్లాలో చేపట్టే అభివృద్ధి వ్యూహాలను వెల్లడించారు. రెండ్రోజుల క్రితం జరిగిన సమావేశంలోనూ కొన్ని కీలక రంగాలకు అవసరాలను నివేదించారు. నిధులు ఇస్తే తప్ప ఒక్క అడుగు కూడా ముందుకు పడే పరిస్థితి లేదు. నిధుల్లేకుండా అధికారులు కూడా ఏం చేయగలరన్నదే ప్రశ్న. కూటమి పాలన మొదలై 9 నెలలు దాటింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలులోకి రాలేదు. ఇప్పటి వరకూ ఎదురు చూపులే మిగిలాయి. ఆర్థిక పరిస్థితి బాగో లేదంటూ కాలం గడుపుతున్నారు. సంపద సృష్టిస్తామన్న చంద్రబాబు మాటలు ఇప్పుడు వినిపించడం లేదనే చర్చ సాగుతోంది. నియోజకవర్గాల్లో నిధుల్లేక అటు పార్టీ శ్రేణులు కూడా సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. అధికారంలోకి వచ్చినా ఏ దారీ కనిపించడం లేదని గ్రామస్థాయి నేతలు గగ్గోలు పెడుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సాదాసీదా కార్యక్రమాలు పెళ్లిళ్ల పేరంటాళ్లకు తిరుగుతూ కాలం గడుపుతున్నారు. సీరియస్ ఎజెండాలో ఎవరూ కనిపించడం లేదు. జిల్లాలో కీలకమైన వెలుగొండ ప్రాజెక్టుపై నేతలు ఏం ఆలోచిస్తున్నారన్నదే ప్రశ్నగా ఉంది. రెండేళ్లలో పూర్తిచేస్తామని చెప్పిన మంత్రులు కార్యాచరణ ఏమీ ఖరారు చేయలేదు. దీనిపై మాటలతో కాలక్షేపం చేస్తున్నారు. దీనికి రూ.889 కోట్లు నిధులు కావాలని కలెక్టర్ నివేదించారు.ఇవి కూడా నిర్వాసితులకు ప్యాకేజీల కోసం.ఇతర అవసరాలూ ఇంకా ఉన్నాయి. అయితే బడ్జెట్‌లో కేవలం రూ.306 కోట్లు కేటాయించారు. ఈ నిధులు ఎందుకూ చాలక పోయినా జిల్లానేతలు మౌనంగా ఉన్నారు. నిధుల్లేకుండా వెలుగొండ ప్రాజెక్టులో ఏ ఒక్కటీ ముందుకు సాగే పరిస్థితి లేదు. జిల్లాలో ఇదే కీలక ఎజెండా. దీనిపట్ల నిర్లక్ష్యమే కనిపిస్తోంది. జిల్లా డెయిరీ మరో ఎజండా. ఇది మూత పడింది. నిర్వహణ లోపంతో మూత పడింది. తెలుగుదేశం హయాంలోనే దివాళా తీసింది. కోట్లు విలువైన పాలపొడి ఫ్యాక్టరీ మూత పడింది. పరికరాలు ▶ 2లో

వాటర్ పార్కును ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

బాపట్ల జిల్లాలో

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

8లో

బయో గ్యాస్ ప్లాంట్ శంకుస్థాపన పనులు పరిశీలిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

స్కీముల పేరుతో టోకరా..!

- రూ.4 కోట్లతో పరారైన బంగారు వ్యాపారి..
- లబోదిబోమంటున్న మహిళలు

ప్రజాశక్తి-మార్కాపురం

స్కీముల పేరుతో ఓ బంగారు వ్యాపారి టోకరా వేశాడు. రూ.4 కోట్లతో పరారయ్యాడు. ఆ వ్యాపారి ఉడాయించడంతో స్కీముల్లో సభ్యులంతా లబోదిబోమంటున్నారు. స్కీముల్లో చేరిన సభ్యులనే కాదు... సహచర వ్యాపారులను, స్నేహితులను సదరు వ్యాపారి బురిడీ కొట్టించాడు. అందినకాడికి దండుకుని పత్తా లేకుండా పోయాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

మార్కాపురం పట్టణంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం సమీపంలోని లక్ష్మి శ్రీనివాస బంగారు దుకాణాన్ని గత కొన్నేండ్లుగా గురిజేపల్లి బ్రదర్స్ నిర్వహిస్తున్నారు. గురిజేపల్లి బాలశ్రీనివాస్, గురిజేపల్లి ప్రసాద్ ఇద్దరూ అన్నదమ్ములు. చాలా కాలంగా మార్కాపురంలో నివాసం ఉంటున్నారు. బంగారు వ్యాపారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు మార్కాపురం పట్టణంలో వ్యాపారాన్ని విస్తరింపజేశారు. నమ్మకాన్ని పెంచుకున్నారు. జనం కూడా గురిజేపల్లి బ్రదర్స్‌ని గట్టిగా నమ్మారు. ఇదే నమ్మకాన్ని సొమ్ము చేసుకోవాలనే ఆలోచనలో స్కీమ్‌లను ప్రారంభించారు. మహిళలకు బంగారంపై ఆశ ఎక్కువే. ఒకేసారి పెద్దమొత్తంలో ▶ 2లో

మూతపడిన బంగారు దుకాణం

స్కీమ్ కార్డు

పారిశ్రామిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- మంత్రి స్వామి
- బయోగ్యాస్ ప్లాంట్ శంకుస్థాపన పనుల పరిశీలన

ప్రజాశక్తి-పీసీపల్లి

జిల్లాను పారిశ్రామికంగా అభివద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని దివాకరపురంలో ఏప్రిల్ 2న జరగనున్న రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ శంకుస్థాపన పనులను ఆయన శుక్రవారం సమీక్షించారు. విద్యాశాఖ మంత్రి లోకేష్, ప్రముఖ పారిశ్రామికవేత్త అనంత్ అంబానీ వస్తున్న సందర్భంగా కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, జెసి గోపాలకష్ణతో కలిసి శంకుస్థాపన పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువుతో అల్లాడుతున్న, పశ్చిమ ప్రాంతాలైన గిద్దలూరు, మార్కాపురంలో బయోగ్యాస్ ప్లాంట్లను త్వరలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల స్థానికంగా ఉపాధి దొరుకుతుందని తెలిపారు. వలసలు నివారించవచ్చని అన్నారు. పరిశ్రమలు పెట్టడం వల్ల భూములకు విలువ పెరుగుతుందని చెప్పారు. అందువల్ల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో జిల్లాలో మరికొన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. శంకుస్థాపనకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో చేయాలని అధికారులను కలెక్టర్ తమీమ్ అన్సారీయా ఆదేశించారు. శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమం ▶ 2లో

నిధులిస్తేనే ముందుకు..

(మొదటిపేజీ తరువాయి)

దెబ్బతినిపోతున్నాయి. భవనాలూ శిథిలావస్థకు చేరాయి.దీన్ని పునరుద్ధరించడానికి రూ.75కోట్లు నిధులు కావాలని కలెక్టర్ నివేదించారు. 40 వేల పాడి రైతులకు దీని వల్ల మేలు జరుగుతుంది. గత ప్రభుత్వం గుజరాత్‌కు చెందిన అమూల్‌కు డెయిరీని అప్పగించారు. ఇప్పుడూ అదే కొనసాగుతోంది. డెయిరీకి పూర్వవైభవం తెస్తారనే ఆశతో రైతులున్నారు. ప్రకాశం విశ్వవిద్యాలయం సౌకర్యాలు లేక కునారిల్లుతోంది. భవనాలు, సౌకర్యాలు పూర్తిగా లేవు. వీటికోసం రూ.203 కోట్లు కావాలని కలెక్టర్ అన్సారియా సిఎంకు నివేదించారు. దీనిపట్ల చాలా కాలంగా ఉదాసీనత కొనసాగుతోంది. ఉన్నత చదువులు అందించే విశ్వవిద్యాలయం పట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. వేసవిలో తాగునీటి అవసరాలకోసం 230 ఆవాసప్రాంతాల్లో నీటి ఎద్దడి తీర్చేందుకు రూ.11.20 కోట్లు నిధులు కోరారు. రవాణాతో అందించాలి. తాగునీటి పథకాలు పనిచేయని చోట్ల ప్రత్యామ్నాయచర్యలు చేపట్టాలి. సాగర్ కాలువల ఆధునీకరణ పనులు చేపట్టేందుకు రూ.9.83 కోట్లు నిధులు కావాలని కోరారు. ఒంగోలులో ట్రిపుల్‌ఐటీ కాలేజీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఎక్కడ కట్టాలనేదీ స్పష్టత లేదు. గతంలో పామూరు వద్ద సిఎం చంద్రబాబు దీనికి శిలాఫలకం వేశారు. దీనిపైనా నిర్ణయంతీసుకోవాల్సి ఉంది. వీటితో పాటు కొన్ని లక్ష్యాలను పెట్టుకున్నారు. వాటికి కూడా నిధులు కావాలి. ఏదేమైనా కలెక్టర్ అన్సారియా మాత్రం జిల్లా అవసరాలు స్పష్టంగా నివేదించారు. నిధులు తేవాల్సిన కర్తవ్యం ప్రజాప్రతినిధులపైనే ఉంది. బడ్జెట్‌లో కేటాయింపులు సరిగా లేకపోయినా ఎవరూ పట్టించుకోలేదు. అసెంబ్లీ సమావేశాల్లోనూ సరైనపాత్ర పోషించలేకపోయారు.

పెంచిన సర్‌ఛార్జీలను రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

పేరుతో స్మార్ట్ మీటర్లను పగుల గొట్టాలని, విద్యుత్ చార్జీలు చెల్లించొద్దని ప్రజలకు పిలుపునిచ్చి, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా అప్పటి ప్రభుత్వంపై కేసులు నమోదు చేయించిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అధికారం చేపట్టిన మరుక్షణమే తామిచ్చిన వాగ్దానాలు మర్చిపోయి గత ప్రభుత్వ బాటలోనే నడుస్తుందని విమర్శించారు. చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చిన టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.15,484 కోట్లు భారం మోపినట్లు విమర్శించారు. సెకితో కుదుర్చుకున్న ఒప్పందం రద్దుపై ప్రభుత్వం ప్రజల్ని మభ్యపెడుతున్నట్లు ఆరోపించారు. శ్రీలంక, పొరుగునున్న తమిళనాడు సెకితో ఒప్పందాలను రద్దు చేసుకున్న విధంగా చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వం సెకి తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవి కొండారెడ్డి మాట్లాడుతూ 2000లో విద్యుత్ బోర్డును మూడు ముక్కలుగా చేసి మొదటి సారి సంస్కరణలకు శ్రీకారం చుట్టిన చంద్రబాబుకు అప్పట్లో ప్రజలు బుద్ధి చెప్పిన అంశాన్ని మరువకూడదన్నారు. ఆ తర్వాత పదేళ్లపాటు ఏ ప్రభుత్వం కూడా విద్యుత్తు జోలికి పోవడానికి సాహసించలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పేరుతో అదానీ వంటి కంపెనీలకు సంపద చేకూర్చేందుకు గత ప్రభుత్వం చేసుకున్న చీకటి ఒప్పందాన్ని భేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెంచిన ట్రూ ఆప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని,ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన విద్యుత్ సంస్కరణలు చేపట్టిన గత ప్రభుత్వాలకు ప్రజలు ఏ విధంగా బుద్ధి చెప్పారో, అదే రీతిలో ఈ ప్రభుత్వానికీ ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు జి.రమేష్, జిల్లా కమిటీ సభ్యులు వి.బాలకోటయ్య, కె.రమాదేవి, పి.కల్పన, నగర నాయకులు తంబి శ్రీనివాసులు, టి మహేష్, దామా శ్రీనివాసులు, బివి.రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణే ధ్యేయం: యుటిఎఫ్

మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వీరాంజనేయులు

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి వీరాంజనేయులు అన్నారు. ప్రాంతీయ మండలాల యుటిఎఫ్ సమావేశం స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శ్రీరాములు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ జీవో 117ను రద్దు చేయాలని అన్నారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడుని ఏర్పాటు చేయడంలో తప్పు లేదని, కానీ పంచాయతీకి ఒక ఆదర్శ పాఠశాల పేరుతో వేరొక ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను విలీనం చేయడంతో నష్టం జరుగుతుందన్నారు. సింగిల్ ఉపాధ్యాయుడితో నడిపే పాఠశాలలు రాబోయే రోజుల్లో కనుమరుగయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్ రవి మాట్లాడుతూ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి విడుదల చేయాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర నాయకులు ఓవీ వీరారెడ్డి మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాలల రద్దు తగదన్నారు. ఉన్నత పాఠశాలలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో బోధన కొనసాగించాలన్నారు. బోధనకు ఆటంకం కలిగించే యాప్‌లను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు పి వెంకటేశ్వర్లు, బాబుల్ నాయక్, బాల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు, పలు మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

రైతులతో మాట్లాడుతున్న ఆత్మ డీపీడీ విజయనిర్మల

ప్రజాశక్తి-సంతనూతలపాడు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే పథకాలు రైతులకు అందాలంటే రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి అని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం విజయనిర్మల అన్నారు. మండలంలోని పేర్నమిట్ట గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులతో మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతుల సంక్షేమం, పంటల సాగుకు పెట్టుబడి సాయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు రైతులకు అందాలంటే రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి అని, తద్వారా సొంత భూమి కలిగిన ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పి పావని మాట్లాడుతూ మండలంలోని 9,173 మంది రైతులకు గాను 6,300 మంది పీఎం కిసాన్ అర్హులైన రైతులలో 6,003 మందికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు తెలియజేశారు. ఈ నెల మార్చి 31వ తేదీలోగా మిగిలిఉన్న రైతులు వెంటనే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు అందరూ తమ పరిధిలో ఉన్న రైతులకు మద్దతు ధరకు ప్రభుత్వం వారు కేటాయించిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించేలాగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ పంట నమోదు రబీ 2024-25కి సంబంధించిన పంట ధ్రువీకరణ పత్రాలు రైతులకు అందించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కెవి సుబ్బారెడ్డి, ఎంపీఈఓ జానకి, రైతులు పాల్గొన్నారు.

స్కీముల పేరుతో టోకరా.!

(మొదటిపేజీ తరువాయి)

పైకం చెల్లించలేక నెలనెలా స్కీమ్‌ల ద్వారా డబ్బు దాచుకోవడం, చివరగా వచ్చిన పైకంతో పాటు మరికొంత నగదు కలుపుకుని ఏదొక వస్తువు చేయించుకోవడం అలవాటు. మహిళల బలహీనతను సొమ్ము చేసుకోవాలనే లక్ష్యంతో గురిజేపల్లి బ్రదర్స్ స్కీమ్‌లను ప్రారంభించారు. స్కీమ్‌లు కూడా చాలా కాలంగా నిర్వహిస్తున్నారు. స్కీమ్ కాలపరిమితి పూర్తయిన తరువాత బంగారు వస్తువు ఇవ్వడం, లేదంటే డబ్బు సకాలంలో ఇవ్వడంతో వారు నిర్వహించే స్కీముల్లో వేలల్లో చేరారు. స్కీముల్లో చేరిన వారిలో మూడొంతులకు పైగా మహిళలే. ఈ విధంగా వేలల్లో సభ్యులు చేరడంతో పదుల సంఖ్యలో స్కీములు నిర్వహణలో ఉన్నాయి. ఒక్కో స్కీమ్ కాల పరిమితి 25 నెలలుగా నిర్ణయించారు. నెలకు ఒక్కో సభత్వానికి రూ.వెయ్యి చొప్పున చెల్లించాలి. నెలనెలా లాటరీ ఉంటుంది. లాటరీలో 25 నెలల్లో 25 మందికి ఆ లాటరీ తగిలే అవకాశం ఉంటుంది. ఆ విధంగా లాటరీ తగిలిన వారు ఆ నెల నుండి ఇక స్కీమ్ చెల్లించకుండానే పూర్తి స్థాయిలో పైకం లేదా వస్తువును పొందుతారు. తాను ప్రారంభించిన స్కీమ్‌లన్నీ 18 నెలలు, 22 నెలలు, మరి కొన్ని 5 నెలలు, 10 నెలలు గడిచాయి. ఒక్కో స్కీమ్‌లో 250 మంది సభ్యుల ద్వారా నెలకు వెయ్యి చొప్పున రూ.2.50 లక్షలు వసూలు జరుగుతుంది. ఈ విధంగా 25 నెలల్లో రూ.62 లక్షలకు పైగా పైకం జమ అవుతుంది. ఈ విధంగా పదుల సంఖ్యలో నిర్వహించిన స్కీమ్‌లతో రూ.కోట్లలో నగదు ప్రోగు చేసుకున్నాడు. గత పది రోజులుగా దుకాణం తెరవడం లేదు. సెల్‌ఫోన్‌లు పనిచేయడం లేదు. దీంతో స్కీమ్‌ల పేరుతో పెద్ద స్కామ్ చేశాడని బాధితులు తెలుసుకున్నారు. స్కీమ్ సభ్యులతో పాటు ఒక్కొక్కరుగా స్నేహితులు, బంగారం కొనుగోలు చేసిన వారు, సహచర బంగారు వ్యాపారులు పెద్ద మొత్తంలో ఆ వ్యాపారులకు అప్పులు ఇవ్వడం జరిగింది. వేలాది మంది స్కీమ్ సభ్యులతో పాటు పదుల సంఖ్యలో సహచర వ్యాపారుల, స్నేహితులను మోసం చేసిన గురిజేపల్లి బ్రదర్స్‌పై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేయాలని, బాధితులకు పైకం తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

సముద్రంలో తాబేళ్లు విడుదల

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు: కొత్తపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగులప్పలపాడు మండలంలోని కనపర్తి పంచాయతీ పరిధిలో చిన్నంగారిపట్టపు పాలెం గ్రామం ప్రాంత సమీపంలో ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలీవ్ రిడ్లు జాతికి చెందిన తాబేళ్లను శుక్రవారం సముద్రంలో వదిలారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సున్నపు తిరుపతయ్య, ఆలీవ్ రిడ్లు తాబేళ్ల సంరక్షకుడు కోడూరి అర్జున్, చిన్నంగారిపట్టపు పాలెం గ్రామపెద్ద సిహెచ్ శ్రీనివాసరావు, కొత్తపట్నం మెరైన్ సిఐ ఎస్ సాంబశివరావు, ఎస్ఐ పి సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కోరారు. పనులు త్వరగా పూర్తిచేసేందుకు కషి చేయాలని ఆదేశించారు. హెలీప్యాడ్‌ను పరిశీలించారు. నేరేడుపల్లి, మురుగుమ్మి మీదుగా విఐపి మార్గాన్ని మంత్రి, కలెక్టర్, అధికారులతో కలిసి పరిశీలించారు. సభాప్రాంగణాన్ని, శంకుస్థాపనకు వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాన్ని, మిగతా అన్ని విషయాలు గురించి అధికారులకు సూచించారు. ఉదయం పది గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఆర్అండ్‌బి, ఎస్‌సి దేవానంద్, జడ్పీ సిఇఓ చిరంజీవి, డ్వామా పీడీ జోసెఫ్, కనిగిరి ఆర్డిఓ జి కేశవర్ధన్‌రెడ్డి, డిఎస్పీ సాయిఈశ్వర యశ్వంత్, సిఐ ఖాజవలీ, తహశీల్దార్ పుల్లారావు, డిటి కె.ధర్మతేజ, విఆర్ఓ రఫీ, విద్యుత్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు, టిడిపి నాయకులు వేమూరి రామయ్య, కరణం తిరుపతరావు, కరణం గంగయ్య, గడ్డం బాలసుబ్బయ్య, స్థానిక సర్పంచ్ కె తిరుపతిరావు, కసిరెడ్డి హనుమారెడ్డి, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న సంఘ సభ్యులు

గిద్దలూరులో ఉగాది సంబరాలు

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని శ్రీ వాసవి కళ్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలకు, చిన్నారులకు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన మహిళలకు, చిన్నారులకు సంఘ సభ్యులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గిద్దలూరు మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు సూరే నాగేశ్వరరావు, సూరే రామచంద్రుడు, బాదం గోపాల్, బాదం వెంకటేశ్వర్లు, గర్రె సుబ్బారావు, శివపురం ఆంజనేయులు, శివపురం కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No.s :1262/2019,
I.A.No.1263/2019, and
I.A.No : 1264/2019
I.A.No.s : 2320/2024,
I.A.No : 2321 /2024 and
I.A.No: 2322/2024
in
O.S.No.159/2010

తాళ్ళూరి కార్తీక్ ....వాది

Vs

1.చుండూరి వెంకటరత్నం & ఇతరులు ....ప్రతివాదులు

ప్రకటన.

టు:

R4) పెంట్యాల శ్రీధర్ S/o లేట్ హనుమంతరావు నూజెళ్ళపల్లి గ్రామము, జె.పంగులూరు మండలము, బాపట్ల జిల్లా

R5) నాదెండ్ల సీతమ్మ W/o హరిబాబు జయరామ్ టాకీస్ సెంటర్, ఒంగోలు టౌన్ & మండలము

R6) పెంట్యాల రామకృష్ణ తండ్రి లేట్ రామారావు, రైల్వే ట్రాక్ దగ్గర, స్టాట్యూ సెంటర్, విఠల్ నగర్, చీరాలటౌన్ & మండలం, బాపట్ల జిల్లా

R7) వీరగంధం ఆనంతలక్ష్మి W/o ఆనంద్ పోలూరు గ్రామము, యద్దనపూడి మండలము, బాపట్ల జిల్లా. సెల్‌నెంబరు: 7995818172

ఈ దావాలో చనిపోయిన రెండవ ప్రతివాది పెంట్యాల హనుమంతరావు వారసులగా 4 & 5 రెస్పాడెంట్స్‌ను దావాలో 4& 5 ప్రతివాదులుగా చేర్చుమని పైనంబరు I.A.No.1262/2019, I.A.No.1263/2019, and I.A.No-1264/ 2019 లలో మరియు ఈదావాలో చనిపోయిన మూడవ ప్రతివాది పెంట్యాల పద్మ వారసులగా 6 & 7 రెస్పాడెంట్స్‌ను దావాలో 6 &7 ప్రతివాదులుగా చేర్చుమని పైనంబరు I.A.No- 2320/2024, I.A.No.2321/2024 and I.A.No.2322/2024 లలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్య పూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నం దువలన మీకు పైపిటీషన్స్‌లలో నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీహాజరు నిమిత్తం ఈ పిటీషన్స్‌ను తేది.29-03-2025నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30ని.లకు పైకోర్టువారి ఏదుట స్వయముగాగాని వకీలు ద్వారాగాని హాజరయి పైదావాలో మీఆక్షేపణలను తెలియజేయవలెను. లేని ఏడల పై నంబరు పిటీషన్స్‌లను మీపరోక్షమందు తీర్మానించదరని తెలియజేయడ మయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //

వజ్రాల అంజిరెడ్డి,
మారం శ్రీనివాసరావు,
తాడికొండ ప్రసాద్ బాబు.
వాది తరుపు న్యాయవాదులు.
అద్దంకి.

ఇసుక తోడే(ళ్లు)స్తున్నారు..

- రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-వేమూరు

ప్రభుత్వం పేదల గహ నిర్మాణాలకు ఇసుకను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుకపాలసీ అధికార పార్టీ నాయకులకు కాసుల పంటగా మారింది. గ్రీన్ ట్రిబ్యునల్ నిర్దేశించిన నిబంధనలను తుంగలో తొక్కి అనుమతులు లేని ప్రాంతాల నుంచి జెసిబిలతో నింపి పెద్దపెద్ద డంపర్లతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. వేమూరు నియోజకవర్గంలో కొల్లూరు మండలం, గాజుల లంకను ఆసరాగా తీసుకుని అక్కడ పొందిన అనుమతులను అడ్డం పెట్టుకుని అనుమతి లేని ప్రాంతంలో రాత్రనకా, పగలనకా వందల సంఖ్యలో పెద్దపెద్ద డంపర్ల ద్వారా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ అక్రమ ఇసుక దందాను అడ్డుకునే నాధుడే కనిపించడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడుగంటుతున్న కృష్ణానది

అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు జిల్లాలో కలెక్టర్‌తో కలిపి స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. అక్రమ ఇసుక దందా వ్యవహారంపై ఈ కమిటీ పర్యవేక్షణ జరిపి తగిన నివేదికలను ప్రభుత్వానికి సమర్పించి చర్యలు చేపట్టాల్సి ఉంది. విఆర్ఒ దగ్గర నుంచి తహశీల్దారు, ఆర్‌డిఒ, మైనింగ్ , రెవెన్యూ శాఖ అధికారులు ప్రమేయం లేకుండా భారీ స్థాయిలో అక్రమ ఇసుక దందా జరుగుతుందంటే స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కనుసన్నలోనే జరుగుతుందనే అనుమానాలను ఆ ప్రాంత వాసులు వ్యక్తం చేస్తున్నారు. వోల్టా చట్టానికి వ్యతిరేకంగా గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ ఇసుక దందా కారణంగా నది గర్భంలోని లంక గ్రామాలకు పెను ప్రమాదం పొంచి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడి ఏడాది పాటు తీయాల్సిన ఇసుకను నెల రోజుల్లోనే తవ్వుతుంటే భవిష్యత్తులో తమ గ్రామాల పరిస్థితి ఏమిటని వాపోతున్నారు. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి పంట పొలాల కోసం లక్షల రూపాయలు వెచ్చించి మోటార్లను ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇదే రీతిలో ఇసుక తరలింపు కొనసాగితే మోటార్లు ఏర్పాటు చేసినా ఫలితం ఉండదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్

నదీ గర్భంలో రహదారి ఏర్పాటు చేసి ..

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రజల రాకపోకల సౌకర్యార్థం మరియు రైతుల పంట ఉత్పత్తులు తరలించడం కోసం గాజులంక శ్రీకాకుళం మధ్య రహదారి ఏర్పాటు చేశారు. ఆ రహదారి నేడు అక్రమ ఇసుక తరలింపుకు అడ్డాగా మారింది. కష్ణాజిల్లా పరిధిలోని ఇసుకను జెసిబిల ద్వారా డంపర్లకు నింపి బాపట్ల, గుంటూరు జిల్లాలకు ఈ రహదారి మార్గంలో తరలిస్తున్నారు. అనుమతి పొందిన ప్రాంతం నుంచి కూలీలతో ట్రాక్టర్లకు ఇసుకను తరలించాల్సి ఉంది. అందుకు భిన్నంగా పగటి సమయంలో నామమాత్రంగా కూలీలతో ఇసుక లోడింగ్ చేపడుతున్నారు. రాత్రి సమయంలో వందల సంఖ్యలో లారీలను ఏర్పాటు చేసి జెసిపిల ద్వారా నింపి ఇసుక తరలిస్తున్నారు. ఇసుక అక్రమ దందా కూటమి ప్రభుత్వ నాయకులు, ప్రజాప్రతినిధుల కనుసన్న లోనే జరుగుతుందనే ప్రచారం జరుగుతోంది.

పంపకాల్లో విభేదాలు..

అక్రమ ఇసుక తరలింపు ద్వారా వచ్చిన సొమ్మును పంచుకొనే విషయంలో టిడిపి, జనసేన పార్టీ నాయకుల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. ఆ సమయంలో ఒకటి రెండు రోజులు ఇసుక తరలింపు నిలిచిపోతుంది. ఇరు గ్రూపులను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయ పర్చటంతో తిరిగి ఇసుక దందా జరుగుతుంది. ఇసుక దందాల కారణంగా భూగర్భ జలాలు అడుగంటటమే కాక వరదల సమయంలో నీరు దిశను మార్చుకొని గ్రామాల వైపు ప్రవహించి కోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకొని అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.

అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలు

రేషన్ బియ్యం పట్టివేత

- ఇద్దరు నిందితులు అరెస్టు
- క్రిమినల్, 6ఏ కేసులు నమోదు

ప్రజాశక్తి -పర్చూరు

అక్రమంగా తరలిస్తున్న 90 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై క్రిమినల్, 6ఏ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ సిఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం... ఓ మినీ లారీలో కారంచేడు నుంచి పర్చూరు మీదుగా చిలకలూరిపేటకు తరలిస్తున్నారు. అందిన సమచారం మేరకు పర్చూరులోని వై జంక్షన్ వద్ద అర్ధరాత్రి రెండు గంటల సమయంలో విజిలెన్స్ అధికారులు ఎన్.సుధీర్ కుమార్, కె.కిషోర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మినీలారీ అదుపులోకి తీసుకొని పరిశీలించారు. అందులో 90 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం తరలిస్తున్న దున్న కోటేశ్వరరావు, గనిపిశెట్టి రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని, మినీ లారీని పర్చూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులపై క్రిమినల్, 6ఏ కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పంగులూరు.

నాగార్జున సాగర్ కాలువలో పడి వద్ధురాలు మతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మార్టూరు మండలం కోనంకి గ్రామానికి చెందిన బిట్రా అన్నపూర్ణమ్మ (55) వలపర్ల లోని తమ బంధువుల ఇంటికి తిరిగి రాలేదు. అయితే ఆమె మృతదేహం ముప్పవరం గ్రామ సమీపంలోని లాకుల వద్ద శుక్రవారం లభ్యమైంది. మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీసి పోస్టు మార్టం ఒంగోలు రిమ్స్ కు తరలించారు.

11 మంది విద్యార్థులు గైర్హాజరు

ప్రజాశక్తి - నగరం

పదోతరగతి పరీక్షకు శుక్రవారం 11 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 324 మందికి గానూ 313 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరైనట్లు ఎంఇఒ పులిలాజర్ తెలిపారు జడ్‌పిహెచ్‌ఎస్ ఉల్లిపాలెం స్కూల్ లో 146 మందికి గానూ 144 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరయ్యారు. ధూళిపూడి కెబి హెచ్‌ఎస్‌లో 48 మందికి 44 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. ముత్తుపల్లి జడ్‌పిహెచ్‌ఎస్‌లో 130 మందికి గారే 125 మంది హాజరుకాగా ఐదుగురు గైర్హాజరైనట్లు ఎంఇఒ తెలిపారు.

సర్వేయర్‌కు అభినందనలు

ప్రజాశక్తి - పంగులూరు : ఈనెల 21 నుంచి 24 వరకూ ఢిల్లీలోని వినయ్ మార్గ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఖోఖో 2024-2025 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ముప్పవరం గ్రామ సచివాలయ సర్వేయర్ పాలపర్తి రవిబాబు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ ఖోఖో పోటీల్లో ప్రాతినిధ్యం వహించడంతో పాటు రాష్ట్ర జట్టుకు పతకాన్ని సాధించి పెట్టారు. రాష్ట్ర జట్టు రజిత పతకం సాధించేందుకు కృషి చేసిన రవిబాబును తహశీల్దారు పి. సింగారావు, మండల సర్వేయర్ సురేష్ బాబు, డిప్యూటీ తహశీల్దారు, సీనియర్ సహాయకులు, ఎంఆర్ఐ, మండల రెవెన్యూ సిబ్బంది శుక్రవారం అభినందించారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దాత

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి- భట్టిప్రోలు

భట్టిప్రోలుకు చెందిన నంద వెంకటేశ్వరరావు అనే విలేకరి గత కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. అందులో భాగంగా కష్ణా జిల్లా చల్లపల్లి మండలం అందాలలంక గ్రామానికి చెందిన వేములపల్లి రాఘవేంద్రరావు శుక్రవారం వెంకటేశ్వరావుకు తన వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల కృష్ణా నదీ వరదల్లో చిక్కుకున్న వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. భోజన వసతి కల్పించారు. తన సొంత డబ్బులతో రోడ్డు ఏర్పాటు చేయించారు. వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. భట్టిప్రోలు విలేకరి వెంకటేశ్వరరావు వైద్య ఖర్చులు పూర్తిగా తానే భరిస్తానని ఈ సందర్భంగా రాఘవేంద్రరావు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు రాకతో

కొత్త గొల్లపాలెంకు మహర్దశ

- త్రీఫేస్ విద్యుత్ లైన్ ఏర్పాట్లు
- రహదారికి మరమ్మతులు
- శరవేగంగా వివిధ రకాల అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- చిన్నగంజాం, వేటపాలెం

చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు, లోవోల్టేజీ సమస్యతో నిత్యం అవస్థలు పడుతున్న కొత్త గొల్లపాలెం గ్రామస్తుల వెతలు తీరనున్నాయి.గ్రామానికి మహర్దశ పట్టనుంది. ఏప్రిల్ 1వ పేదల సేవ కార్యక్రమంలో భాగంగాముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిన్నగంజాం మండలం పెదగంజాం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్త గొల్లపాలెంలో పర్యటించనున్నారు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం మొత్తం కొత్త గొల్లపాలెంలో దష్టి సారించారు. యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టారు. మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటు చేయిస్తున్నారు. అదే విధంగా రెండు కిలోమీటర్ల పరిధిలో అసలు విద్యుత్ లైనే లేని ప్రాంతంలోనూ నూతనంగా విద్యుత్తు లైను ఏర్పాటు చేశారు త్రీఫేస్ విద్యుత్తు లైన్ల పనులను అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. పనిలో పనిగా కోడూరువారిపాలెం ప్రాంతానికి కూడా విద్యుత్తు లైను ఏర్పాటు చేస్తున్నారు.

విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఆర్‌అండ్‌బి ఇఇ రాజా నాయక్ ఆధ్వర్యంలో చీరాల డిఇఎం నళిని పర్యవేక్షణలో ఎఇ శ్రీకాంత్ హెలిపాడ్, బారికేడ్ల పనులను పర్యవేక్షిస్తున్నారు. పంచాయతీ రాజ్ శాఖ డిపిఒ ప్రభాకర్ ఆదేశాల మేరకు పర్చూరు కారంచేడు,స్వర్ణ,యద్దనపూడి,చిన్నగంజాం, వేటపాలెం ఇఒపిఆర్‌డిలు, డిపిఒ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు 6 బందాలుగా ఏర్పడి గ్రామం మొత్తం పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో పోలేరమ్మ గుడి ప్రజా వేదిక వద్ద నిర్వహిస్తున్న స్థలంలో గోతులను జెసిబి లతో పూడ్చివేసి చదును చేస్తున్నారు రచ్చబండ వద్ద గ్రామస్తులతో ముఖాముఖి వేదికను సిద్ధం చేస్తున్నారు. పోలీస్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి

సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల

విద్యుత్ ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు, సఖి ఒప్పందం, టైమ్ ఆఫ్ డే విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ బాపట్ల పాత బస్టాండ్ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి నాయకులు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించి, పగలగొట్టాలని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యుత్ విధానాల్లో జగన్మోహన్ రెడ్డి బాటలోనే చంద్రబాబు పయనిస్తున్నారన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అప్పట్లో టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి న్యాయస్థానంలో కేసు కూడా వేసినట్లు తెలిపారు. నాడు వైసిపి విమర్శించి నేడు అవే విధానాలను అమలు చేస్తుందని ఈ అవకాశవాదాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. రాబోవు కాలంలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని గంగయ్య హెచ్చరించారు. ఇందుకోసం ప్రజలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందర్, శరత్, రామారావు, బి. కొండయ్య, నూతలపాటి కోటేశ్వరరావు, వై. భాస్కరరావు, కె.నాగేశ్వరరావు, సుభాషిణి, రాజేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

చీరాల : ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలని, సెకీ వప్పందాలు రద్దు చేయాలని, టైం ఆఫ్ డే విధానం రద్దు చేయాలని కోరుతూ సిపిఎం చీరాల ప్రాంతీయ కమిటి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విద్యుత్ డిఇ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం చీరాల ప్రాంతీయ కార్యదర్శి ఎన్. బాబూరావు మాట్లాడుతూ జగన్ సర్కారు పోయి బాబు సర్కారు వచ్చినా కూడా ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గటం లేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.3700 కోట్లు భారాన్ని మోపినట్లు తెలిపారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉండి వ్యతిరేకించిన టిడిపి కూటమి నేడు అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే రూ.15,484 కోట్లు భారాన్ని ట్రూఆఫ్ చార్జీలు పేరుతో ప్రజలపై మోపినట్లు తెలిపారు. నాడు స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండి అండగా ఉంటాం అన్న టిడిపి నేడు మీరు స్మార్ట్ మీటర్లు పెట్టండి ఎవరు అడ్డుకొంటారో చూస్తాం అన్నట్లుగా కంపెనీ తరుపున వకాల్తా తీసుకొని మరి వెంటుండి వేగంగా బిగిస్తున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం హయాంలో చేసుకున్న లోపాయికారీ శకీ ఒప్పందాల ద్వారా లక్ష ఇరవై వేల కోట్లు భారాన్ని ప్రజలపై మోపనున్నట్లు తెలిపారు. ఆ ఒప్పందాన్ని రద్దు చేయకుండా అమలు చేస్తామని అదాని కంపెనీకి భరోసా ఇవ్వటం అంటే రాష్ట్ర ప్రజలని నమ్మించి మోసగించడమే అన్నారు. ఈ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చీరాల నాయకులు ఎం. వసంతరావు ఎల్.జయరాజు, ఎం. సత్యమూర్తి, ఐ వి. ప్రసాద్, కాలుష్య సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

చీరాల విద్యుత్ డిఇ కార్యాలయం వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

శ్రీనివాసరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

బాపట్ల ఎఎంసి చైర్మన్‌గా కావూరి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి -బాపట్ల

బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాపట్ల పట్టణానికి చెందిన కావూరి శ్రీనివాస రెడ్డి నియమితులయ్యారు. బాపట్ల ఎఎంసి చైర్మన్‌గా కావూరి శ్రీనివాసరెడ్డి పేరును ప్రకటిస్తూ ప్రభుత్వం జాబితా విడుదల చేసింది. శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే నరేంద్ర వర్మకు అత్యంత సన్నిహితుడిగా ఉన్నారు. ఎఎంసి చైర్మన్‌గా నియమితుడైన శ్రీనివాసరెడ్డికి బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ , బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, గొలపల శ్రీనివాసరావు, ముక్కామల శివ, ఏపూరి భూపతిరావు, నక్కల వెంకటస్వామి, పల్లం సరోజినీ, అఫ్జల్, టిడిపి నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

అద్దంకి ఎఎంసి చైర్మన్‌గా వరగాని పద్మావతి

ప్రజాశక్తి- మేదరమెట్ల

అద్దంకి మార్కెట్ యార్డు చైర్మన్‌గా కోరిశపాడు మండలం పి.గుడిపాడు గ్రామానికి చెందిన వరగాని పద్మావతి నియమితు లయ్యారు. అద్దంకి ఎఎంసి చైర్మన్‌గా పద్మావతి పేరును ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జాబితా విడుదల చేసింది. పద్మావతి తండ్రి మంద నాగేశ్వరరావు టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉన్నారు. పార్టీ పిలుపు నిచ్చిన ప్రతి కార్యక్రమంలో పాల్గొంటున్నారు. పార్టీకి విధేయుడిగా ఉన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టిడిపి మండల నాయకుడు చెన్నుపాటి హరిబాబు, మేదరమెట్ల శ్రీనివాసరావు , మన్నే రామారావు, టిడిపి మండల అధ్యక్షుడు జాగర్లమూడి జయకష్ణ, తెలుగు యువత మండల అధ్యక్షుడు కొట్టే రవీంద్ర, టిడిపి నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా పద్మావతి ధన్యావాదాలు తెలిపారు.

వరగాని పద్మావతి

ఎస్‌పి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్ఐ

ఎస్ఐ రవీంద్రకు ప్రశంసా ప్రతం

ప్రజాశక్తి - కర్లపాలెం

లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేసిన కర్లపాలెం ఎస్ఐ రవీంద్రను జిల్లా ఎస్‌పి తుషార్ డూడి అభినందించారు. పోలీస్ జిల్లా ప్రధానకార్యాలయంలో ఎస్ఐ రవీంద్రకు ఎస్‌పి ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ విధి నిర్వహణ ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు దారుల పట్ల ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరించాలన్నారు. వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని తెలిపారు.

30న హాకీ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్ర 15వ జూనియర్ పురుషుల అంతర్ జిల్లాల హాకీ ఛాంపియన్ షిప్ బాపట్ల జిల్లా క్రీడాకారుల జట్టు ఎంపిక ఈ నెల 30న నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి బి. వీరచంద్ర శుక్రవారం తెలిపారు. బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఏప్రిల్ 6 నుంచి 9 వరకు ధర్మవరంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి స్థాయి హాకీ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు 2006 జనవరి 1 లోపు జన్మించి ఉండాలన్నారు. ఆధార్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు, పాస్ పోర్టు, డిఎల్ లేదంటే పాఠశాలలో నమోదు పత్రం తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. హాకీ సామగ్రి సొంత స్టిక్, షిన్‌గార్డ్‌లు, ఇతర సురక్షిత ఉపకరణాలు స్వయంగా తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9704669060 సెల్ నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -పంగులూరు

పంగులూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పంగులూరులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఎఇ గోరంట్ల అనీల్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

మద్యం దుకాణం వద్దని ధర్నా

ప్రజాశక్తి -రేపల్లె

తమ నివాస ప్రాంతాల్లో మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని కోరుతూ మండల పరిధిలోని పేటేరు మహిళలు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం, ఎంఆర్‌పిఎస్ ,సిపిఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ ప్రజలు వ్యతిరేకిస్తున్న చోట మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు భాస్కర్, కిషోర్, భిక్షాలు, నాగేశ్వర రావు, సిపిఐ నాయకులు జి.బాలాజీ, పి.నాగాంజనేయులు మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల పేరుతో అనుమతి తెచ్చుకున్న మద్యం షాపుల యజమానులు ప్రజల నివాసాలు ఉండే చోట మద్యం షాపు ఏర్పాటును విరమించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పేటేరు కొత్తపేట ,చందోలు గూడెం నివాస ప్రాంతాల ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పేదల సేవకే 'టిడిపి' : ఏలూరి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పేదలకు సేవ చేసేందుకే కీర్తి శేషులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు టిడిపి స్థాపించారని, పార్టీ ఆవిర్భావం ఓ చరిత్ర అని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం టిడిపి నాయలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శనివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. అందుకు ప్రతినాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. రాజకీయం అంటే అధికారం అనుభవించడం కాదని, ప్రజలకు సేవ చేయడమని, దేశ రాజకీయాలలో సంక్షేమ పాలనను ఎన్‌టిఆర్ నేర్పారని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు కేవలం ఓటర్లుగా మిగిలిపోకుండా రాజకీయాలను శాసించే స్థాయికి చేరాలని, పార్టీలోనూ, పాలనలోనూ వారికి పదవులు ఇచ్చారని తెలిపారు. ఎన్‌టిఆర్ వారసత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కొనసాగిస్తున్నారని ఏలూరి కొనియాడారు. ఎన్‌టిఆర్ ఆశయాలను చంద్రబాబు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఆనాటి నుంచి నేటి వరకూ తెలుగు ప్రజల ఖ్యాతి, అభ్యున్నతి లక్ష్యంగా తెలుగు ప్రజల సేవలో తెలుగుదేశం పార్టీ నిమగ్నమైందన్నారు. ఇక ముందు కూడా ఇదే అంకితభావంతో తెలుగు ప్రజల బంగారు భవిష్యత్తుకు టిడిపి కృషిచేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు.

నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి
శనివారం 29 మార్చి 2025

మార్కాపురం ఏఎంసి చైర్మన్‌గా 'మాలపాటి'

ప్రజాశక్తి-మార్కాపురం

వెంకటరెడ్డి

మార్కాపురం పట్టణానికి చెందిన మాలపాటి వెంకటరెడ్డి ఎఎంసి చైర్మన్‌గా పేరు ఖరారైంది. ఆయనతో పాటు పలువురు డైరెక్టర్ల పేరు కూడా ఖరారయ్యాయి. మాలపాటి వెంకటరెడ్డి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ప్రధాన అరుచరుడు కూడా. మాలపాటికి టిడిపిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన ఏప్రిల్ 10వ తేదీ తరువాత మార్కాపురం రానున్నట్లు తెలిసింది. ఆయనతో చర్చించిన తరువాత ప్రమాణ స్వీకార ఏర్పాట్లు ఉంటాయని తెలిసింది. ఏప్రిల్ 12 నుండి మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు మంత్రులు హాజరవుతారు. అదే సమయంలో ప్రమాణస్వీకార మహోత్సవం చేపట్టాలనే ఆలోచనలో మాలపాటి ఉన్నట్లు తెలిసింది.

గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా బాలయ్య

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

బాలయ్య

గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా గిద్దలూరు మండలం, లింగాపురం గ్రామానికి చెందిన బైలడుగు బాలయ్య యాదవ్ ఎన్నికయ్యారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులుగా పనిచేస్తున్న బైలడుగు బాలయ్య గిద్దలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివద్ధిలో ప్రముఖ పాత్ర పోషించారు. గిద్దలూరు ఏఎంసి చైర్మన్‌గా తనను నియమించినందుకు గానూ గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి బాలయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి..

విద్యుత్ ఎస్‌ఇకి సిఐటియు వినతి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్స్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని, లేనియెడల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 7న సిఎండి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టవలసి వస్తుందని సిఐటియు హెచ్చరించింది. శుక్రవారం నాడు ఆ సంఘ నాయకులు జివి.కొండారెడ్డి, జి.శ్రీనివాసులు, పి.కల్పనతో కూడిన బృందం విద్యుత్ భవన్‌లో ఏపీ సీపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లును కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సంస్థలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, ఆ కార్మికులకు చెందిన 2022 పిఆర్సి అరియర్స్ ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్స్, పీస్ రేట్ కార్మికులకు (స్టోర్ హమాలీలు, బిల్ కలెక్టర్లు) ఉద్యోగ భద్రత కల్పించి ఎస్కో అకౌంట్ ద్వారా నేరుగా కార్మికులకే వేతనాలు చెల్లించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరారు.

ఉద్యోగోన్నతితో మెరుగైన సేవలందించాలి

ఎస్పీ ఏఆర్ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉద్యోగోన్నతితో పోలీస్ సిబ్బందికి మెరుగైన సేవలందించాలని జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ ఏఒ ఎస్‌కె ఎమ్‌డి ఉస్మాన్ బాషాకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పరిపాలనా విభాగంలో పని చేస్తున్న అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్‌కె ఎమ్‌డి ఉస్మాన్ బాషా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొంది శుక్రవారం జిల్లా ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్‌పి ఉస్మాన్ బాషాకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌పి(అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఒ రామ్మోహన్ రావు, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

12 మంది వాహనదారులకు జరిమానా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సిఐ పాండురంగారావు

మద్యం తాగి వాహనం నడిపిన 12 మంది వాహనదారులకు రూ.29 వేలు జరిమానాను స్పెషల్ జెఎస్‌సిఎం జడ్జి విధించినట్లు ఒంగోలు ట్రాఫిక్ సిఐ వై.పాండురంగారావు తెలిపారు. శుక్రవారం నాడు మీడియాతో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు ఒంగోలు ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 13 మందిని శుక్రవారం స్పెషల్ జెఎస్‌సిఎం జడ్జి వివిఎస్ రామారావు వద్ద హాజరు పరచగా 12 మంది వాహనదారులకు రూ.29 వేల జరిమానా, ఒక్క వాహనదారుడికి రూ.5 వేలు జరిమానా, రెండు రోజులు బెయిలు లేని జైలు శిక్షను విధించారన్నారు. ఎవరూ కూడా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, వాహనదారులందరూ ఎంవి యాక్ట్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని సిఐ సూచించారు.

వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలి

- కనిగిరి డివిజన్‌లో ప్రజా సమస్యలు పరిష్కరించండి
- డిఆర్‌ఒకు సిపిఎం బృందం వినతి


డిఆర్‌ఒకు అర్జీ ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల వాంఛ వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేసుకు సిపిఎం ప్రతినిధి బృందం కోరింది. కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. డిఆర్‌ఒ ఛాంబర్‌లో శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20న కనిగిరి ఆర్.డి.ఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశామన్నారు. ఇటీవల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లు ప్రవేశపెట్టాయని, ఈ బడ్జెట్లలో ప్రకాశం జిల్లా ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. కనిగిరి, పొదిలి, దర్శి పట్టణాలలో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఉద్దేశించిన స్కీమ్‌లను పూర్తిచేయడానికి అవసరమైన నిధులను కేటాయించాలన్నారు. దొనకొండ జాతీయ డ్రైవింగ్ స్కూల్ నిర్మాణాన్ని పూర్తిచేసి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ట్రిపుల్ ఐటి కాలేజీని నిర్మించే స్థలం వివాదాన్ని పరిష్కరించి కళాశాల నిర్మాణాలు చేపట్టాలన్నారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులను వేగవంతం చేసి వచ్చే దసరా నాటికి రైళ్ళు నడపాలన్నారు. కనిగిరి ఏరియా ఆసుపత్రిలో మత్తు డాక్టర్, ఇతర అన్ని రకాల సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలన్నారు. డయాలసిస్ సెంటర్ వైద్యుని నియమించాలని, కనిగిరి ఏరియా ఆసుపత్రితో సహా డివిజన్‌లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యసేవలు, మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలన్నారు. అర్హులైన వ్యవసాయ కార్మికులందరికీ సాగుభూమి ఇవ్వాలని, అసైన్‌మెంట్ భూములను ఆక్రమణదారుల నుండి కాపాడాలన్నారు. కనిగిరి టిడ్కో ఇళ్ళ నిర్మాణాన్ని పూర్తిచేయాలని, పొదిలి, దర్శి నగర పంచాయితీలను టిడ్కో స్కీమ్ లోకి తేవాలన్నారు. స్పందించిన డిఆర్‌ఒ ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి అవసరమైన కషి చేస్తానని హామీ ఇచ్చారు. డిఆర్‌ఒను కలిసిన సిపిఎం ప్రతినిధి బందంలో సిపిఎం నాయకులు సిహెచ్.వినోద్, కెఎఫ్.బాబు ఉన్నారు.

'డంపింగ్ యార్డు'లోనే చెత్తను వేయాలి

- ఇతర చోట్ల వేస్తే చర్యలు
- కమిషనర్ వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

చెత్తతో ట్రాక్టర్ నిండిన తరువాత మాత్రమే ఆ చెత్తను గుత్తికొండవారిపాలెంలో ఉన్న డంపింగ్ యార్డ్‌కి తరలించాలని, అలాకాకుండా వేరే చోట పోసినట్లయితే వెంటనే ఆ ట్రాక్టర్‌ని అదే రోజు నుంచి ఆపివేస్తామని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వర రావు హెచ్చరించారు. కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నగరపాలక సంస్థలో శానిటేషన్ విభాగంలో చెత్తను తీసుకెళ్లే ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ట్రాక్టర్లలో చెత్తను తీసుకొని వెళుతున్నప్పుడు ఆ చెత్తను తప్పనిసరిగా పూర్తిగా పట్టాను కప్పి కవర్ చేసుకొని వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలని శానిటరీ సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. ప్రతి ఒక్క డ్రైవర్ కూడా తప్పనిసరిగా వ్యాలిడ్ లైసెన్స్, ట్రాక్టర్ కూడా తప్పనిసరిగా ఆర్సీ బుక్ కలిగి ఉండాలన్నారు. లోడర్స్ పని చేస్తున్న వర్కర్స్ అందరూ కూడా తప్పనిసరిగా మధ్యాహ్నం 2 వరకు పనిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రిప్ షీట్ ద్వారా ఏ ట్రాక్టర్ ఎన్ని ట్రిప్పులు తిరిగిందో ప్రతిరోజూ సాయంత్రం రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి ట్రాక్టర్‌కు జిపిఎస్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, శానిటరీ సూపర్వైజర్ పిచ్చయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ముస్లిముల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి స్వామి

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాగుంట, సత్య, స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

ముస్లిం మైనార్టీల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం రాత్రి శింగరాయకొండలో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంతో మంత్రి స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, దామచర్ల సత్య పాల్గొ న్నారు. దామచర్ల సత్య మాట్లాడుతూ నియోజకవర్గ ముస్లిం సోదరులతో కలిసి ఈ కార్యక్రమం జరుపు కోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌కె.సంధాని భాషా, షేక్ సనావుల్లా, షేక్ యస్దాని, అబ్దుల్ సుభాని, వేల్పుల సింగయ్య, చీమకుర్తి కృష్ణ, కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, మించల బ్రహ్మయ్య, సుదర్శి ప్రసాద్‌రావు, సన్నిబోయిన శ్రీనివాసరావు, బ్రహ్మేశ్వరరావు, చిగురుపాటి శేషగిరి, గనిపనేని రవిచౌదరి, శీలం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆక్వా కల్చర్ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విక్రమ సింహపురి యూనివర్శిటీ డిపార్టుమెంటు ఆఫ్ మెరైన్ బయాలజీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సెమినార్‌కు హాజరై.. అత్యుత్తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఆక్వా కల్చర్ డిపార్టుమెంటు విద్యార్థులను ఏ.కే.యూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి అభినందించారు. అభినందించిన వారిలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి హరిబాబు, యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ నిర్మలామణి ఉన్నారు.

నకిలీ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎస్‌పి ఏఆర్ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌పి దామోదర్

అవినీతి నిరోధక శాఖ/ ఆర్టీఐ యాక్ట్/ మీడియా/ మానవ హక్కుల సంస్థల పేరుతో డబ్బులు డిమాండ్ చేసే నకిలీ కాల్స్ పట్ల ఉద్యోగులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి ఏఆర్.దామోదర్ సూచించారు. రిజిస్ట్రేషన్లు లేని నకిలీ సంస్థలు పేరుతో ఆర్టీఐ యాక్ట్, మీడియా, మానవ హక్కుల సంస్థల పేరుతో కాల్స్ చేస్తూ బెదిరిపులకు పాల్పడితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌పి హెచ్చరించారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగస్తులకు కొందరు వ్యక్తులు అవినీతి నిరోధక శాఖ అధికారులుగా నటిస్తూ ఉద్యోగస్తులను ఫోన్ కాల్స్ ద్వారా బెదిరిస్తూ, డబ్బులు అడుగుతుంటే అటువంటి మోసపూరిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఉద్యోగులు/ వ్యాపారస్తులు/ ప్రజలను బెదిరింపులకు గురిచేస్తే వెంటనే సంబంధిత అధికారులకు, స్థానిక పోలీసులకు లేదా డయల్ 100/112కు లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9121102266 సమాచారం అందించాలన్నారు. మోసగాళ్లపై సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఫ్యామిలీ కోర్టు ఏపిపిగా శ్రీనారెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

శ్రీనారెడ్డి

ఫ్యామిలీ, అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పాలపర్తి శ్రీనారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది పాలపర్తి శ్రీనారెడ్డి సిఎస్ఆర్ శర్మ కాలేజీలో డిగ్రీ, ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీలో లా పట్టా పొందారు. ఆయన 1995 సంవత్సరం నుంచి న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనం రామనారాయణరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బిఎన్ విజయ్‌కుమార్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

క్షతగాత్రులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

అప్పికట్ల రహదారిలో రోడ్డు ప్రమాదం..

సంఘటన చూసి కాన్వాయ్ ఆపిన మంత్రి దుర్గేష్..

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల-అప్పికట్ల రహదారి మార్గంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఒక ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో అదుపుతప్పిన ట్రాక్టర్ పొలాల్లోకి దూసుకెళ్లింది. ట్రాక్టర్లో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. అదే సమయంలో బాపట్ల పర్యటనకు వెళ్తున్న మంత్రి కందుల దుర్గేష్ కాన్వాయ్ ఆపి క్షతగాత్రులను పరామర్శించారు. త్రుటిలో ప్రమాదం తప్పిందని తెలుసుకున్న మంత్రి తిరిగి కాన్వాయ్ లో బాపట్ల వెళ్ళిపోయారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు.

కవి సమ్మేళనంలో గర్నెపూడి యోగుకు సన్మానం

కవి సమ్మేళనంలో గర్నెపూడికి సన్మానం

ప్రజాశక్తి-దర్శి

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులో జరిగిన ద్విశతాధిక జాతీయ కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన కవులు పాల్గొని తమ కవితలు వినిపించారు. వసంతాన్ని స్వాగతిస్తూ, చైత్రాన్ని పలకరిస్తూ ఉగాది ప్రాశస్త్యాన్ని తెలిపారు. వీరిని అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, ఇతర ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన జాలాది మోహన్, మైనంపాటి సాయికుమార్, నెమ్మాని సీతారామమూర్తి, నెమ్మాని హరిప్రియాదేవి, బంతికట్ల నాగేశ్వర్‌రెడ్డి, మోడీ గర్నెపూడి యోబు, దేవరకొండ ప్రసన్న పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో కదిరి పార్థసారథి

మత సామరస్యానికి ప్రతీక 'ఇఫ్తార్'

ప్రజాశక్తి-సిఎస్.పురం

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలతో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి అన్నారు. కోవిలంపాడులోని మసీదు వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు. ముందుగా ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ నమాజ్ చేసి విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ బుజ్జి, ఉపసర్పంచ్ టి బాబురావు, మాజీ ఎంపిటిసీ మునగల నారాయణరెడ్డి, వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్నగౌడ్, నున్నా నారాయణ, ఇరగని మాధవరావు, షేక్ సత్తార్, గోపి, పాశం సురేష్ పాల్గొన్నారు.

మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు

'బకాయిలు చెల్లించనందునే రుణాలివ్వలేదు..'

ప్రజాశక్తి-టంగుటూరు

స్త్రీ నిధి ఋణాలు రూ.1.58 కోట్లు బకాయి ఉందని, బకాయి వసూలు కానందున మహిళలకు స్త్రీనిధి ఋణాలు ఇవ్వలేక పోయినట్లు వెలుగు ఎపిఎం డి జయరాజ్ తెలిపారు. జరుగుమల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి బెల్లం నిర్మల సత్యన్నారయణ అధ్యక్షత న శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఎంవి రమణమూర్తి, వైస్ ఎంపిపి పులి బిక్షాలు, పశు వైధ్యాధికారి జక్కుల శ్రావణి, గృహనిర్మాణ ఎఒ కె సీతారాంసింగ్, ఎపిఓ కొక్కిలిగడ్డ నాగరాజు పాల్గొన్నారు.

'మార్కెట్ ఫిట్'పై అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి-టంగుటూరు

ఒంగోలులోని స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాల్లో సిఎస్ ఐటీ చదువుతున్న విద్యార్థులకు సొల్యూషన్ ఫిట్ అండ్ ప్రోడక్ట్ మార్కెట్ ఫిట్‌పై అతిథి ఉపన్యాసం జరిగింది. ఎంబిఏ ప్రొఫెసర్ సిహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్కెట్ నందు తెసుకోవలసిన జాగ్రతలు వివరించారు. సెక్రటరీ కరస్పాండ్ డాక్టర్ ఎం శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జివికె మూర్తి, ఎన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాండవ మంగమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-దర్శి

సిపిఎం నియోజకవర్గ నాయకులు తాండవ రంగారావు తల్లి మంగమ్మ భౌతిక కాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ శాసన సభ్యులు నారపుశెట్టి పాపారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు మాట్లాడుతూ పేదలు, కార్మికులు పక్షాన రంగారావు గత 30ఏళ్లుగా పని చేయడం వెనుక ఆయన అమ్మ తాండవ మంగమ్మ ప్రోత్సాహం ఉందని అన్నారు. ఆయనకు కుటుంబ సభ్యులు మొత్తం అండగా నిలబడటం ద్వారా మాత్రమే ప్రజాసమస్యలపై పోరాటాలు చేయడం సాధ్యమన్నారు. మంగమ్మ అనారోగ్యంతో మరణించడం రంగారావుకు వ్యక్తి గతంగా ఉధ్యమపరంగా తీరని లోటని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడం ద్వారానే ఆమెకు నివాళులు అర్పించడం అవుతుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, సినీయర్ నాయకులు జాలా అంజయ్య, బాపట్ల జిల్లా సిపిఎం నాయకులు మెండ్రు ఆంజనేయులు, తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు యాదగిరి వాసు, పట్టణ క్లస్టర్ నాయకులు నారపుశెట్టి మధు, జూపల్లి

నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

కోటేశ్వరరావు, సిపిఐ ఏరియా కార్యదర్శి మాడపాకుల రమేష్ బాబు, కోటంశెట్టి హనుమంతరావు, కరుణానిధి, మాజీ ఎజిపి మారం రాజశేకరరెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు మీనిగ శ్రీనివాసరావు, టి రాజశేకర్, అట్లూరి రామారావు, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం రమేష్, పి బాలనరసయ్య, సిపిఎం దర్శి, ముళ్ళమూరు, దొనకొండ మండలాల కార్యదర్శులు సందు వెంకటేశ్వరరావు, కెవి పిచ్చయ్య, వెల్లంపల్లి ఆంజనేయులు, చిరుపల్లి అంజయ్య, తదితర నాయకులు ఆమెకు నివాళులు అర్పించి రంగారావు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

మున్సిపాలిటీలో వుడ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-దర్శి

కార్పెంటర్స్ డే సందర్భంగా స్థానిక కాశిరెడ్డి టింబర్ డిపో కాంప్లెక్స్ సముదాయంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, జిల్లా ఉపాధ్యక్షులు గొళ్ళపాటి శ్రీనివాసచారి ఆధ్వర్యంలో పొదిలి కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాచర్ల రాజశేఖర్, సెక్రటరీ మునగంటి రవి, గుత్తికొండ కళ్యాణ్, ట్రెజరర్ దర్శి సీనియర్ కార్పెంటర్ నడింపల్లి విస్వరూపాచారి, సోడా చంద్రశేఖరాచారిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చెన్నుపల్లి శ్రీనివాసచారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కార్పెంటర్లకు వుడ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేయాలని, ఉన్న వర్క్ షాప్‌లకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని

సీనియర్ కార్పెంటర్లను సన్మానిస్తున్న నాయకులు

కోరారు. సన్మాన గ్రహీత రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లా సంఘం ఆధ్వర్యంలో కార్పెంటర్లు గౌరవించడం మంచి సాంప్రదాయం అన్నారు. కార్యక్రమంలో గోనుగుంట్ల దిలీప్, బంగారు వెంకటేశ్వర్లు, సిహెచ్ వెంకటేశ్వర్లు, నాగార్జున, బ్రహ్మం, నాగాచారి పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం సార్డ్స్, శ్రీంప్ సునర్జీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఉద్దేశించి ఎంపీడీఓ డి జయమణి మాట్లాడుతూ శిబిరం ప్రాధాన్యత వివరించారు. సార్డ్స్ వివిధ కార్యక్రమాలతో పాటు ఇలాంటి మంచి కార్యక్రమాలు ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ చైతన్యకష్ణ మాట్లాడుతూ ఎండలు ఎక్కువవుతున్న సమయంలో ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మంచి ఆహారం తీసుకోవాలని వివరించారు. ప్రభుత్వ వైద్యశాల్లో వైద్య సిబ్బంది అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నారని, దీనిని వినియోగించుకోవాలని సూచించారు. వేసవిలో వృద్ధులు జాగ్రత్తలు డీపీఎం విగ్నేష్ వివరించారు. ప్రజలు

ఎంపిడిఓకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

జీవన శైలిలో వచ్చే మార్పులు గమనించి డాక్టర్ సలహాలు పాటించాలనిఅ న్నారు. సార్డ్స్ ప్రతినిధి లక్ష్మీ రాజ్యం మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరు తగిన శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రహర్ష, ప్రియాంక, జయకుమార్, పంచాయతీ కార్యదర్శి ఎన్ జగదీష్, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, వార్డు సభ్యులు వలేటి రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన 'చెత్త నుంచి సంపద తయారీ' శిక్షణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలోని మూలగుంటపాడు పంచాయతీలో గత వారం రోజులుగా చెత్త నుంచి సంపద తయారీపై అధికారులకు ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. శింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి, మర్రిపూడి, పొన్నలూరు, కొండేపి మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులతోపాటు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. చెత్త నుంచి సంపద తయారు చేసే విధానాలపై మూలగుంటపాడులోని ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ దగ్గర శిక్షణ నిర్వహించారు. పంచాయతీలో వస్తున్న చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ ఎంతో ఉపయోగపడిందనీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డి జయమణి, ఈఒఆర్డి సుధాకర్, మూలగుంటపాడు పంచాయతీ సర్పంచ్ డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి, పంచాయతీ

చెత్త సంపద కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

కార్యదర్శి కె రామారావు, ఎన్ సురేంద్ర, పాకల పంచాయతీ కార్యదర్శి షేక్ సుభాని, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ చిమట సుధాకర్, నియోజకవర్గ రిసోర్స్ పర్సన్ టీ అశోక్ ఉన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి పాస్టర్ సంఘాల నిరసన

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సిబిసిఐడితో దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి-దర్శి

ఇటీవల రాష్ట్రంలో సంచన సృష్టించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆ కేసును సిబిసిఐడికి బదలాయించి దర్యాప్తు చేయించి పాస్టర్ ప్రవీణ్ పగడాల కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పాస్టర్ ప్రేయర్ ఫెలోషిప్, దళిత సంఘాల ఆధ్వర్యంలో క్రిస్టియన్‌పాలెం నుండి గడియార స్థంభం వరకు శుక్రవారం శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గాలిముట్టి దేవప్రసాద్, గర్నెపూడి ప్రేమ్‌కుమార్, కవలకుంట్ల గోవింద్, ప్రసాద్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి కార కులైన వారిపై ప్రభుత్వం సీబీసిఐడి చేత సమగ్ర దర్యా ప్తు జరిపించి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. తక్షణమే హెూంమంత్రి స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆ కుటుంబానికి చట్టపర మైన రక్షకల్పించాలని కోరారు. తహశీల్దార్ శ్రావణ్ కుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజే శారు. పాస్టర్ సంఘం నాయకులు గల్లెపోగు ఏసుదాసు, కొదమల ప్రసాదు, గౌడపేరు పౌలు, పాలిపోగుడ క్లాస్, కూరాకుల డేనియల్ ఫౌల్ పాల్గొన్నారు.

రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని కొనకనమిట్ల పశు వైద్యాశాల పరిధిలోని పశు పోషకులకు 75శాతం రాయితీపై గడ్డి జొన్న విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, స్థానిక పశు వైద్యశాలలో పంపిణీ చేస్తున్నట్లు పశువైద్యాధికారి అమూల్య శుక్రవారం తెలిపారు. బోరు ఉన్న పశు పోషకులకు విత్తనాలు రాయితీపై అందిస్తున్నన్నట్లు చెప్పారు. అసలు ధర కేజీ రు.92 ఉందని, రాయితీ పోను మిగిలిన సొమ్ము చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ పూర్ణచంద్రరావు, మహబూబ్‌బాష, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ త్రోబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-దర్శి

ఆంధ్రప్రదేశ్ త్రో బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర ఎంపికలు ఈ నెల 26న గుంటూరు జిల్లా తెనాలిలోని మినిస్టేడియంలో జరిగాయి. ఈ పోటీల్లో మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి మాగులూరి ప్రేమ్‌కుమార్ జాయితీ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 29న పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానో పాధ్యాయులు జి గురుప్రసాద్, పిడి అంజిరెడ్డి తెలిపారు.

ఎం ప్రేమ్‌కుమార్

టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

330 పొగాకు బేళ్ళు కొనుగోలు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం 294 పొగాకు బేళ్ళు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. బోర్డు పరిధిలో పంగులూరివారిపాలెం, తూమాడు గ్రామాలకు చెందిన పొగాకు రైతులు 330 బేళ్ళను అమ్మకానికి తీసుకు రాగా అందులో 294 బేళ్ళను వ్యాపారులు కొనుగోలు చేశారు. 36 బేళ్ళను వివిద కారణాల చేత తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.280, కిలో పొగాకు అత్యల్ప ధర రూ.250, సరాసరి ధర రూ.270.03 పలికిందన్నారు.

ఖోఖో జట్టుకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి -పంగులూరు

ఒరిస్సా రాష్ట్రంలోని పూరి పట్టణంలో నిర్వహిస్తున్న 57వ జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టు శిక్షణ ముగింపు కార్యక్రమం స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి మరియు బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని ఎస్ ఆర్ ఆర్ ఖోఖో అకాడమీలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు సింగారావు క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు . ఈ క్రీడా దుస్తులను పంగులూరు ఎస్సార్ స్పోర్ట్స్, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ తరుపున మేకల సీతారామరెడ్డి , ఉషారాణి స్పాన్సర్ చేశారు. రాష్ట్ర పురుషుల జట్టు గత 15 రోజులుగా ఎస్ ఆర్ ఆర్ ఖోఖో అకాడమీలో గ్రామ పెద్దల సహకారంతో శిక్షణ తీసుకున్నారు. ఈ జట్టు క్రీడాకారులు శనివారం బయలుదేరి పూరి వెళ్తారని ఖోఖో రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, మేనేజర్ కె.గురుప్రసాద్, అహ్మద్, ఆలివాన్ పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న జాతీయ ఖోఖో జట్టు క్రీడాకారులు

జాతీయ జట్టు క్రీడాకారులు వీరే.

ప్రకాశం జిల్లాకి చెందిన కె. రామ్మోహన్, ఎం. ఫణి కుమార్, కె.వంశీ, కె. మహేష్, ఎం. ప్రసాద్, ఎ. వీరాంజనేయులు,జి. నాగ వెంకట శివ, విజయనగరం జిల్లాకు చెందిన జె. నితీష్, వి. భానుప్రసాద్, పి. నరసయ్య, అనంతపురం జిల్లాకు చెందిన సతీష్, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎం .సాయి వెంకట్, చిత్తూరు జిల్లాకు చెందిన సిహెచ్.రాజేష్, శ్రీకాకుళం జిల్లాకు చెందిన కె.ప్రవీణ్, విశాఖపట్నం జిల్లాకు చెందిన బి. కిరణ్, కష్ణా జిల్లాకు చెందిన వై.వర్షిత్ ముకుంద యాదవ్, కడప జిల్లాకు చెందిన హరి ప్రసాదు తదితరులు జట్టులో ఉన్నారు.

వక్ఫ్ బోర్డు కమిటీలో అన్య మతస్తుల

నియామకంపై ముస్లిముల నిరసన

ప్రజాశక్తి - బాపట్ల

వక్ఫ్‌బోర్డులో అన్య మతస్తులను నియమించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు బాపట్ల అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీం జానీ తెలిపారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా ఫజలూర్ రహీం, జమైతుల్ ఉలేమా హింద్, దేవ బంద్ సంస్థ చైర్మన్ అర్షద్ మది పిలుపుమేరకు ముస్లిం సోదరులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్ జానీ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించి 76 యేళ్ళు పైబడినప్పటికీ ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వం ముస్లింలకు అన్యాయం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. ముస్లింల వక్ఫ్‌బోర్డు ఆస్తులను ముస్లింలకు దక్కకుండా అన్యమతస్తులకు కట్టబెట్టేందుకు కమిటీలో సభ్యుడిగా చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ముస్లింలను లక్ష్యంగా చేసుకొని వారి హక్కులను కాలరాయడమే పనిగా పెట్టుకుందన్నారు. దేశంలో అనేక ప్రధాన సమస్యలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కి కుల రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. ముస్లింల ప్రమేయం లేకుండా ఆర్టికల్ 370 , ట్రిపుల్ తలాక్ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం అమలు చేసిందని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా వక్ఫ్ బోర్డు పై బిజెపి కన్ను పడిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి కుల రాజకీయాలకు స్వస్తి పలికి భారతదేశ అభివద్ధికి పాటుపడాలని హితవు పలికారు. బిజెపి అమలు చేస్తున్న నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పట్టణంలోని అన్ని మసీదులలో ముస్లిం సోదరులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అంజుమన్ కమిటీ కార్యదర్శి అబ్దుల్ కరీం, ఉపాధ్యక్షుడు షేక్ బాజీ , సంయుక్త కార్యదర్శి మహమ్మద్ రఫీ, కోశాధికారి మీరా సాహెబ్, సభ్యులు ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ముస్లింలు

సోలార్ ఎనర్జీ సొల్యూషన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

ప్రజాశక్తి-బాపట్ల

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఆదా కోసం సోలార్ పథకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. బాపట్ల పట్టణంలోని జిబిసి రోడ్డు గ్యాస్ ఆఫీస్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పిఎం సూర్య ఘర్ సోలార్ ఎనర్జీ సొల్యూషన్స్‌ను బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబుతో కలిసి నరేంద్ర వర్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భావితరాలకు ఇంధన వనరులు ఆదా చేయాలనే మహా సంకల్పంతో ప్రభుత్వం సోలార్ సిస్టంను ప్రవేశా ఎట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఇ జి. ఆంజనేయులు, డిఇ జి .భాస్కరరావు, ఏడీ శ్రీనివాసరావు, పట్టణ ఎఇ సాయి శ్రీనివాస్, రూరల్ ఎఒ కె.శ్రీనివాస రావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జడ్జి

చట్టాలపై అవగాహన ఉండాలి : జడ్జి

ప్రజాశక్తి- చీరాల

పోక్సో ఇతర చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. సుధ తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక యార్లగడ్డ అన్నపూర్ణమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో పోక్సో చట్టం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థినులు సమాజంలో తమ చుట్టూ ఉన్న మానవ మగాల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆపద సమయంలో ధైర్యాన్ని సడలనీయక, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని ఉద్బోధించారు. పోక్సో చట్టంతో పాటుగా వివిధ చట్టాల ప అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైఎ.డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శరత్ ,వైస్ ప్రిన్సిపల్ జి.నీలా కుమారి, బాపట్ల గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.నాగమణి,డాక్టర్ బాబూరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్. స్నేహలత ,పిఎల్‌విలు ఎస్‌డి. మతీన్, జె.సాయి కృష్ణ ,కళాశాల సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌రావు

డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-అద్దంకి

స్థానిక కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల 41వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.మోహన్‌రావు మాట్లాడుతూ సాంస్కతిక కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు మాట్లాడే నైపుణ్యం మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల వార్షిక నివేదికను సమర్పించారు. కళాశాల అధ్యాపకులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎండోమెంట్ చెక్కులు అందజేశారు. వివిధ సాహిత్య సాంస్కతిక పోటీలలో క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుడి రాజశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయురాలు సుశీలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి- భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన ఎనిమిది మందికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదగా సిఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. అందజేశారు. కాజ చంద్రమౌళికి రూ.60,557 , ఉసరపు కోటేశ్వరరావుకు రూ.57,522, చింతర్లంక కేదరినాథ్ వెంకట్ కు రూ.42000 , దేవరకొండ నాగలక్ష్మి కి రూ.37142 , చిలుకోటి లలితకు రూ.30,786, పరిశ బేబీ కి రూ.30,028, జి.పుష్ప కు రూ..27214, చింతా నాగలక్ష్మికి రూ.13,350 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాచర్ల నాగరాజు, ప్రసాదరావు, కూరపాటి రఘురామయ్య, పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి -మేదరమెట్ల

కోరిశపాడు మండలంలో 2023 -24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన స్థానిక ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. రూ.6.70 కోట్లకు గానూ రూ.5 కోట్లు కూలీలకు, రూ.1.70 కోట్లు మెటీరియల్ కు ఖర్చు అయినట్లు ఆడిట్లో తేలింది. మండల పరిధిలో 877 పనులకు గానూ రూ. 6.70 కోట్లు ఖర్చు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎవి. విజయలక్ష్మి ,డివిఒ శోభన్ బాబు ,ఎస్ఆర్ పి చిరంజీవి ,పంచాయతీ రాజ్ ఎఇ ప్రసాద్ ,మండల అభివద్ధి అధికారి ఆర్.రాజేశ్వరి, జడ్‌పిటిసి టి. వెంకటరమణ, ఎపిఒకోటేశ్వరి ,టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె నుంచి హైదరాబాద్‌కు ఇంద్ర బస్సు సర్వీస్ : డిఎం

ప్రజాశక్తి -రేపల్లె

రేపల్లె ఆర్‌టిసి డిపో నుంచి హైదరాబాద్ బిహెచ్ఇఎల్‌కు ఇంద్ర బస్సు సర్వీస్ నడుతుపున్నట్లు డిపో మేనేజర్ సుఖవాసి సునీల్ కుమార్ తెలిపారు. ఈ బస్సు సర్వీస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ బస్సు రేపల్లె డిపో నుంచి బయలు దేరి వెల్లటూరు, తెనాలి, విజయవాడ మీదుగా హైదరాబాద్ బిహెచ్ఇఎల్‌కు చేరుకుంటుందన్నారు. వేమూరు నియోజక వర్గ ప్రయాణికుల సౌకర్యార్థం అక్కడ బస్సుకు స్టాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రేపల్లె నుంచి నగరం, చెరుకుపల్లి తెనాలి మీదుగా బిహెచ్ఎల్ వెళ్లే అమతలూరు ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు స్టాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేమూరు, అమతలూరు గ్రామాల ప్రజలు ఇంద్ర బస్సు సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఎమ్మెల్యే కొండయ్యను సన్మానిస్తున్న ఛైర్మన్, కౌన్సిలర్లు

గతంతో పని లేదు..

ప్రజల కోసమే పని చేస్తా..

- ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య
- ప్రశాంతంగా మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి-చీరాల

చీరాల మున్సిపల్ అభివద్ధిలో అందరూ ప్రధాన పాత్ర పోషించాలని, గతంతో ఉన్న పరిస్థితులను పట్టించుకోను గానీ 'నేనంటూ వచ్చాక ఒక మార్క్ వేసుకోవాలనే తపనతో అభివద్ధిపై ప్రజల కోసం పనిచేస్తున్నా..' అని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు హాలులో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాస రావు అధ్యక్షతన కౌన్సిల్ 2025-2026 వార్షిక మున్సిపల్ బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎక్స్ అఫీషియో మెంబర్ హెూదాలో స్థానిక ఎమ్మెల్యే కొండయ్య హాజరయ్యారు. 2025-26 సంవత్సరానికి గానూ రూ.62.64 కోట్లతో మున్సిపల్ అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరమే సభలో అధికారులు బడ్జెట్ వివరాలు వెల్లడించారు. రూ.62.64 కోట్ల ఆదాయం సమకూరుతుందని, రూ.62.03 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. రూ.60 లక్షల మిగులుతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సభ్యులు బడ్జెట్‌కు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ బడ్జెట్ రూపకల్పన, ప్రాధాన్యతా రంగాలను గుర్తించి వాటిపై దష్టి సారించిన పాలకవర్గాన్ని అధికారులను అభినందించారు. పట్టణ సమగ్ర అభివద్ధికి ఈ బడ్జెట్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఆదర్శ పట్టణంగా తీర్చి దిద్దుతామన్నారు. అనంతరం చీరాల ఏరియా హాస్పిటల్‌కు క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం కోసం రూ.23.75 కోట్లు మంజూరు చేయించడంలో కృషిచేసిన చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్యకు కౌన్సిల్ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మునిసిపల్ పాలకవర్గం మరియు అధికారులు ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఈ-కామర్స్‌లో ఎస్‌హెచ్‌జి ఉత్పత్తులు సాధకారితలో మెప్మా సంస్థ సాధించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ మెప్మా మేనేజర్ ఆర్పీలకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ రషీద్, మున్సిపల్ కౌన్సిలర్స్ మరియు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లాలో

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పర్యాటకరంగంలో బాపట్ల జిల్లా అభివృద్ధి సాధించేలా తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. బాపట్ల మండలంలోని కపానగర్ సమీపంలోని వి హోటల్ ఆవరణలో నూతనంగా నిర్మించిన వాటర్ పార్క్‌ను శుక్రవారం మంత్రి దుర్గేష్, బాపట్ల, చీరాల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, మద్దులూరి మాలకొండయ్యతో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ రంగంలో బీచ్ రీసార్టులు వేగంగా విస్తరిస్తున్నాయన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇక్కడ హెూటళ్లు, వాటర్ పార్కులు రావడం అభినందనీయమన్నారు. రానున్న కాలంలో జిల్లా అభివృద్ధికి మెండుగా అవకాశాలు ఉన్నాయన్నారు. పిపి మోడ్‌లో పర్యాటకరంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 974 కిలోమీటర్ల మేర ఉన్న సముద్రతీర ప్రాంతాన్ని మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా, ప్రకృతిని సంరక్షిస్తూ, ఉద్యోగ,ఉపాధి అవకాశాలను పెంచే చర్యలు చేపడుతున్నామన్నారు. టెంపుల్ టూరిజం, అడ్వంచర్ టూరిజంలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. టూరిజంను ఇండస్ట్రీగా మార్పు చేసి సింగిల్ విండో విధానంలో రానున్న కాలంలో పూర్తిస్థాయి పర్యాటకరంగ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో పర్యాటక రంగంలో 50 వేల గదులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సూర్యలంక బీచ్ అభివృద్ధి కోసం రూ.97.52 కోట్ల నిధులు మంజూరు అయినట్లు చెప్పారు. రామాపురం బీచ్‌ను కూడా పిపి మోడ్‌లో అభివృద్ధి చేస్తామన్నారు. సినిమా షూటింగ్‌లు కూడా ఇక్కడ జరుగుతున్నాయని, స్టూడియోలు నిర్మించాలని నిర్మాతలను అడుగుతున్నారన్నారు. చీరాల పొట్టిసుబ్బయ్యపాలెం నుంచి బాపట్ల సూర్యలంక వరకు రహదారి నిర్మాణానికి కావలసిన నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ జిల్లా పర్యాటకరంగ అభివృద్ధి కోసం స్థానికంగా పర్యాటక శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రానున్న కాలంలో జిల్లా నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.100 కోట్ల మేర పన్నుల ద్వారా ఆదాయం వచ్చేలా చూస్తామన్నారు. నూతనంగా రిసార్టులతో పాటు, స్టార్ హెూటళ్లు కూడా సూర్యలంకలో ప్రారంభం కానున్నాయన్నారు. 13 కిలోమీటర్ల మేర ఉన్న సూర్యలంక వాడరేవు రహదారి నిర్మాణానికి రూ.20 కోట్ల నిధుల అవసరం ఉందన్నారు. సూర్యలంక బీచ్ అభివృద్ధితో పాటు బాపట్ల నుంచి నిజాంపట్నం బోటింగ్ సౌకర్యం తేవాల్సి ఉందన్నారు. చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య మాట్లాడుతూ జిల్లాలో ఉన్న రెండు జాతీయ రహదారులను అనుసంధానిస్తూ చీరాల పొట్టిసుబ్బయ్యపాలెం నుంచి బాపట్ల సూర్యలంక వరకు రహదారి నిర్మాణానికి నిధులు విడుదల చేస్తే జిల్లా పర్యాటకరంగంలో మరింత గా అభివృద్ధి చెందుతుందన్నారు. చీరాల ఎమ్మెల్యే కొండయ్య, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మలు రెండు నియోజకవర్గాల్లో పర్యాటకరంగ అభివృద్ధికి చేపట్టవలసిన పలు అంశాలతో కూడిన వినతిపత్రాలను మంత్రి కందుల దుర్గేష్ అందజేశారు. కార్యక్రమంలో బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, వి హెూటల్స్ యండి సందీప్, కుమార భాస్కర్, జనసేన పార్టీ నాయకులు నామన వెంకట శివన్నారాయణ, ఆమంచి స్వాములు తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

జిల్లా ఉద్యానశాఖ అధికారి జెన్నెమ్మ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

మామిడి, జీడి మామిడి తోటల సాగు లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారిణి పి జెన్నమ్మ సూచించారు. తోటల సాగులో సమగ్ర సస్య రక్షణ చర్యలపై శుక్రవారం రైతుల కు అవగాహన సదస్సు నిర్వహించారు. బాపట్ల జీడిమామిడి పరిశోధన స్థానం, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి మరియు జీడి మామిడిలో మేలైన యాజమాన్య పద్ధతులు మరియు

మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి జెన్నెమ్మ

సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాజిల్లా ఉద్యాన అధికారి జెన్నెమ్మ ,జిల్లా సూక్ష్మ సేద్యపు అధికారి బీవీ రమణ హాజరై రైతులకు సూచనలు చేశారు.జిల్లాలో వేటపాలెం, చిన్నగంజాం, కడవకుదురు, పందిళ్ళపల్లి, కర్లపాలెం మొదలగు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మామిడి మరియు జీడి మామిడి పంటలను సాగు చేస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో ఏం ఐఓబి వి రమణ, కీటక శాస్త్ర నిపుణులు డాక్టర్ జి స్రవంతి, డాక్టర్ ఆర్ బాల మురళీధర నాయక్, వాణిశ్రీ , వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు

సిఎం పర్యటన ఏర్పాట్లను

వేగవంతం చేయాలి..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కలెక్టర్ వెంకటమురళి

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఏప్రిల్ 1వ తేదీన ముఖ్యమంత్రి పర్యటించనున్న చిన్నగంజాం మండలం మండలం కొత్త గొల్లపాలెం గ్రామంలో జరుగుతున్న ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శనివారం సాయంత్రంలోగా ముఖ్యమంత్రి హెలిప్యాడ్ పనులను పూర్తి చేయాలని ఆర్ అండ్ బి ఇంజనీర్లకు చెప్పారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభా వేదిక వద్ద బ్యారికెడ్ లను ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రజావేదికను సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. ప్రజా వేదికను సౌకర్య వంతంగా తయారు చేయాలన్నారు. ముఖ్యమంత్రి సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సభకు వచ్చే ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి, ప్రజా ప్రతినిధుల కోసం గ్రీన్ రూమ్ లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా వేదిక వద్ద 2 వేల మంది కూర్చునే విధంగా సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పేదల సేవలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని జిల్లా రెవెన్యూ అధికారికి చెప్పారు. అధికారులకు అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆయన సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో కేసులు చేధించాలి

- అత్యవసర కాల్స్‌కు వేగంగా స్పందించాలి..
- ఎస్పీ తుషార్‌డూడీ

ఎస్పీ తుషార్‌డూడీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా పోలీస్ యంత్రాంగం వత్తి నైపుణ్యతతో పాటు సాంకేతిక ప్రజ్ఞానాన్ని వినియోగించుకొని కేసులు చేధించాలని, కేసులలో పురోగతిని ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో పొందుపరచాలని, అత్యవసర కాల్స్‌కు వేగంగా స్పందించాలని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ అధికారులతో శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలోని సమావేశ హాలులో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సిసిటిఎన్ఎస్ నివేదికను ఆధారం చేసుకొని కేసుల దర్యాప్తు, ఛార్జ్ షీట్ నమోదు, మిస్సింగ్ కేసుల దర్యాప్తు, చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలపై నిఘా, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, రాత్రి సమయాలలో గస్తీ విధులు, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై తీసుకోవలసిన చర్యలు, శక్తి యాప్ గురించి అవగాహన, పి.జి.ఆర్.ఎస్ అర్జీల విచారణ తదితర విషయాల పై జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో కంట్రోల్ చేయాలన్నారు. హైవేల దగ్గరలో ఉన్న వెంచర్లు, శిథిలావస్థలో, నిరుపయోగంగా ఉన్న భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా లుగా మారుతున్నాయన్నారు. అటువంటి ప్రదేశాలపై నిఘా ఉంచాలన్నారు. తరచూ ఆ ప్రదేశాలను సందర్శిస్తూ ఉండాలన్నారు. డ్రోన్‌ల సహాయంతో నిర్మానుష్య ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైతే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందో ఆ ప్రదేశాలను గుర్తించి అక్కడ రోడ్డు ప్రమాదాలు తరచూ జరగడానికి గల కారణాలను అధ్యయనం చేయాలన్నారు. ఆ ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు, బ్లింకింగ్ లైట్స్, జీబ్రా క్రాసింగ్ లైన్స్ ఏర్పాటు చేయడం, చెట్ల పొదలను తొలగించడం వంటి చర్యలతో పాటు ఆ ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన కూడళ్ళు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, వాణిజ్య దుకాణాలు ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆదిలోనే నేరాలను నియంత్రించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కేసులను చేదించడంలో సీసీ కెమెరాలు క్రియాశీలక పాత్ర పోషిస్తాయి అన్నారు. వాటిని ఉపయోగించి త్వరితగతిన అత్యంత సులువుగా కేసుల దర్యాప్తు నిర్వహించవచ్చునన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు.

వేసవి కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందన్నారు. పోలీస్ అధికారులు వారి పరిధిలో గస్తీ విధులను ముమ్మరం చేయాలన్నారు. పాత నేరస్తులు మరలా ఏదైనా నేరానికి పాల్పడితే సంబంధిత పోలీస్ అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శక్తి యాప్, డయల్ 100, 112 కాల్స్ కు త్వరితగతిన స్పందించకుంటే శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టిపి.విఠలేశ్వర్, బాపట్ల డిఎస్పి రామాంజనేయులు, చీరాల డిఎస్పి మోయిన్, రేపల్లె డిఎస్పి శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పి విజయ సారథి, ట్రైనీ డిఎస్పి రావూరి అభిషేక్, జిల్లా ఎస్ బి ఇన్స్పెక్టర్ నారాయణ, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ బాల మురళీకష్ణ ,జిల్లాలోని ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీస్ అధికారులుకు ప్రశంసా పత్రాలు

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొత్తం 21 మంది పోలీస్ అధికారులు సిబ్బందిని శుక్రవారం జిల్లా ఎస్పీ తుషార్ డూడి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. చిన్నగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడికి నేరం జరిగిన 9 నెలల లోపే జీవిత ఖైదు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్న ఇంకొల్లు సీఐ రమణయ్య, చిన్నగంజాం ఎస్సై రమేష్, కోర్టు కానిస్టేబుల్ నాగేశ్వరరావులను అభినందించారు.